# సార్వత్రిక సమరభేరి

మొదటిపేజీ తరువాయి...
పాల్గొన్నారు.

**నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు**
ఆంధ్రప్రదేశ్‌తో పాటు అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, ఒడిశా రాష్ట్రాల్లోనూ అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఇందులో భాగంగా ఏపీ అసెంబ్లీకి పార్లమెంట్ ఎన్నికల నాలుగో విడత జరిగే మే 13న ఒకే దశలో ఎన్నికలు జరుగనున్నాయి. 60 అసెంబ్లీ సీట్లు ఉన్న అరుణాచల్ ప్రదేశ్, 32 స్థానాలు ఉన్న సిక్కింలో ఏప్రిల్ 19న ఒకే విడతలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఒడిశాలో(147 స్థానాలు) మాత్రం నాలుగు విడతలుగా(మే 13, 20, 25, జూన్ 1) అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించనున్నారు.

**ప్రజాస్వామ్య పండుగకు సిద్ధం**
భారతదేశ ప్రజాస్వామ్య పండుగ నిర్వహణకు ఎన్నికల సంఘం పూర్తి సంసిద్ధంగా ఉన్నదని సీఈసీ రాజీవ్ కుమార్ మీడియా సమావేశంలో పేర్కొన్నారు. ఈ ఏడాది (2024) ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల సంవత్సరమని, అందులోనూ భారతదేశ ఎన్నికలు ఒక ధ్రువ తార వంటివని, ప్రపంచ దృష్టంతా మనపైనే ఉంటుందని అన్నారు. ఇప్పుడు మా బృందం(కొత్త కమిషనర్ల నియామకాన్ని ఉద్దేశిస్తూ) నిండుగా ఉన్నదని, ప్రపంచ వేదికపై భారత ప్రభను మరింత పెంచే విధంగా లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఓటింగ్ శాతం పెంచడం, ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడమే తమ లక్ష్యమని తెలిపారు. ధన బలం, అంగ బలం, తప్పుడు సమాచారం, ఎన్నికల నియమావళిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. సరిహద్దుల్లో డ్రోన్ ఆధారిత తనిఖీలు చేపడుతామని, నాన్ చార్టెడ్ విమానాలపై నిఘా ఉంచుతామని, తప్పుదోవ పట్టించే ప్రకటనలు, ఫేక్ న్యూస్‌పై ఉక్కుపాదం మోపుతామని, ఎన్నికల హింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

**26 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు**
లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటుగా దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లోని 26 అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికలకు కూడా ఈసీ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి నాలుగో విడతలో భాగంగా మే 13న ఉప ఎన్నిక జరుగుతుందని ప్రకటించింది. ఉప ఎన్నికలు జరుగనున్న 26 స్థానాల్లో ఇటీవల హిమాచల్‌ప్రదేశ్‌లో అనర్హత వేటుకు గురైన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల స్థానాలు కూడా ఉన్నాయి. ఇంకా, గుజరాత్‌లో 5, యూపీ-4, పశ్చిమబెంగాల్-2, బీహార్, హర్యానా, జార్ఖండ్, మహారాష్ట్ర, త్రిపుర, రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడులో ఒక్కొక్క స్థానం చొప్పున ఉన్నాయి. ఆయా స్థానాల్లో ఎమ్మెల్యేల రాజీనామాలు, పార్టీ మార్పులు, పలువురికి జైలు శిక్షల కారణంగా ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.

**వీలైనంత త్వరగా జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు**
లోక్‌సభ ఎన్నికలు పూర్తైన తర్వాత జమ్ముకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహిస్తామని సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. భద్రత దృష్ట్యా జమ్ముకశ్మీర్‌లో ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్‌లో ప్రతి అభ్యర్థికి సెక్యూరిటీని కేటాయించాల్సి ఉంటుందని, దేశవ్యాప్తంగా ఎన్నికలు నిర్వహిస్తున్న సమయంలో అది కుదరదని పేర్కొన్నారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ తర్వాత గత ఏడాది డిసెంబర్‌లో జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని సవరించారని, ఆ తర్వాతి నుంచే ఎన్నికల సంఘం సమయం ప్రారంభమైందని అన్నారు.

**ఈవీఎంలు 100 శాతం సురక్షితం**
పోలింగ్ కోసం వినియోగించే ఈవీఎంలపై వస్తున్న పలు అనుమానాలపై సీఈసీ రాజీవ్ కుమార్ స్పందించారు. ఈవీఎంలు 100 శాతం సురక్షితమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా దాఖలైన పలు పిటిషన్లపై దేశంలోని వివిధ కోర్టులు విచారణ చేపట్టాయని, ప్రతిసారీ ఆయా పిటిషన్లను కోర్టులు తిరస్కరించాయని అన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించి వస్తున్న ఫిర్యాదుల విషయంలో ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తుందనే ఆరోపణలను సీఈసీ తిరస్కరించారు. అన్ని ఫిర్యాదులను తీసుకొంటున్నామని పేర్కొన్నారు. కాగా, పలు ఈవీఎంలను అనుసంధానం చేసే, ఫలితాలను కలిపేసే, బూత్‌ల వారీగా ఓటింగ్ సరళిని దాచే కొత్త సాంకేతికత కేంద్ర ఎన్నికల సంఘం వద్ద సిద్ధంగా ఉన్నదని, అయితే దాన్ని అమలు చేసే సమయం ఇంకా రాలేదని అన్నారు.

**గోయల్ రాజీనామాపై సమాధానం దాటవేత**
ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్ ఆకస్మిక రాజీనామాకు గల కారణంపై సీఈసీ రాజీవ్ కుమార్ సూటిగా సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన రాజీనామా చేసివుంటే, దాన్ని మనం గౌరవించాల్సి ఉందన్నారు. ఎన్నికల సంఘంలో భిన్నాభిప్రాయాలను గౌరవిస్తామని, ఒకటి నుంచి మూడు ఆలోచనలు మెరుగైనవని అన్నారు.

## పటిష్ఠ బందోబస్తు

ఎన్నికల భద్రతకు మోహరించనున్న కేంద్ర సాయుధ పోలీస్ బలగాలు
**3.4 లక్షల మంది**
రాజకీయ హింస ఎక్కువగా ఉన్న పశ్చిమబెంగాల్‌కు **92,000**
ఉగ్రవాద ప్రభావిత జమ్ముకశ్మీర్‌కు **63,500**
నక్సల్స్ ప్రభావిత ఛత్తీస్‌గఢ్‌కు **36,000**

### ఏ రాష్ట్రానికి ఎన్ని కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు

| | |
|---|---|
| బీహార్ | 295 |
| యూపీ | 252 |
| ఏపీ | 250 |
| గుజరాత్ | 200 |
| తెలంగాణ | 160 |

ఒక్కో సీఏపీఎఫ్ కంపెనీలో 100 మంది సిబ్బంది ఉంటారు.



ఎన్నికల షెడ్యూల్ వెల్లడిస్తున్న సీఈసీ రాజీవ్ కుమార్ (మధ్యలో), ఎన్నికల కమిషనర్లు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్ సింగ్ సంధు

### 85 ఏండ్ల పైబడిన వారు 'ఇంటి నుంచే ఓటు'

లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా 85 ఏండ్లు పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి 'ఇంటి నుంచే ఓటు' వేసే అవకాశం కల్పించినట్టు సీఈసీ రాజీవ్ కుమార్ వెల్లడించారు. 85 ఏండ్ల పైబడిన వారి నుంచి ఇంటి నుంచి ఓటు తీసుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇందు కోసం నామినేషన్ల కంటే ముందే ఓటు వేసే విధానాన్ని ఎంచుకొనేందుకు వారి ఇండ్లకు 12డీ ఫారంను పంపుతామని తెలిపారు. 'ఇంటి నుంచే ఓటు' విధానాన్ని ఎంచుకొంటే, వారి ఇంటి వద్దనే ఓటింగ్ నిర్వహిస్తామని వివరించారు. ఈ ప్రక్రియను ఇంతకుముందు అసెంబ్లీ ఎన్నికల్లో దేశంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించామని, లోక్‌సభ ఎన్నికల్లో అమలు చేయడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు.

## సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్

| దశ | నోటిఫికేషన్ | నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ | నామినేషన్ల పరిశీలన | ఉపసంహరణకు చివరి తేదీ | పోలింగ్ |
|---|---|---|---|---|---|
| 1 | మార్చి 20 | మార్చి 27 | మార్చి 28 | మార్చి 30 | ఏప్రిల్ 19 |
| 2 | మార్చి 28 | ఏప్రిల్ 4 | ఏప్రిల్ 5 | ఏప్రిల్ 8 | ఏప్రిల్ 26 |
| 3 | ఏప్రిల్ 12 | ఏప్రిల్ 19 | ఏప్రిల్ 20 | ఏప్రిల్ 22 | మే 7 |
| 4 | ఏప్రిల్ 18 | ఏప్రిల్ 25 | ఏప్రిల్ 26 | ఏప్రిల్ 29 | మే 13 |
| 5 | ఏప్రిల్ 26 | మే 3 | మే 4 | మే 6 | మే 20 |
| 6 | ఏప్రిల్ 29 | మే 6 | మే 7 | మే 9 | మే 25 |
| 7 | మే 7 | మే 14 | మే 15 | మే 17 | జూన్ 1 |

## పార్టీలకు ఈసీ అడ్వైజరీ

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు అడ్వైజరీ జారీచేసింది. ప్రచారం సమయంలో నిబంధనలను అతిక్రమించొద్దని, విద్వేష ప్రసంగాలు చేయొద్దని సూచించింది.

- ప్రచారం సమయంలో పార్టీలు, అభ్యర్థులు, క్యాంపెయినర్లు మంచి ప్రవర్తనతో ఉండాలి.
- విద్వేష ప్రసంగాలు చేయొద్దు. మతం, కులం పేరుతో ఓట్లు అడుగొద్దు.
- వ్యక్తిగత జీవితం లక్ష్యంగా దాడులకు దూరంగా ఉండాలి.
- ధ్రువీకరణ లేని, తప్పుదోవ పట్టించే ప్రకటనలకు దూరంగా ఉండాలి.
- ప్రచారంలో చిన్న పిల్లలను ఉపయోగించుకోవడం నిషిద్ధం.
- వార్తల ముసుగులో ప్రకటనలను కూడా అనుమతించబోం.
- ప్రత్యర్థులను అవమానించేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టకూడదు.

## మే 13న ఏపీ ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి...
నెలకొన్నది. 2014 పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూటమిగా పోటీచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీలు తాజాగా పదేండ్ల తర్వాత మరోసారి జట్టు కట్టాయి. అధికార వైసీపీ దాదాపు 50 సిట్టింగ్ స్థానాల్లో మార్పులు చేర్పుల తర్వాత శనివారం 25 లోక్‌సభ, 175 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. సీఎం జగన్మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైసీపీ ఎన్నికల్లో ప్రధానంగా తమ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలే ఓట్లు కొల్లగొడుతాయనే ఆశ పెట్టుకొన్నది. గత ఎన్నికల్లో 151 స్థానాల్లో భారీ విజయం సాధించిన వైసీపీ.. ఈసారి వైనాట్ 175 అనే నినాదాన్ని ఎత్తుకొన్నది. మరోవైపు ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదని, ఈసారి వైసీపీకి ఘోర పరాభవం తప్పదని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు అంటున్నారు. గత ఎన్నికల్లో 23 స్థానాలకే పరిమితమైన మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ.. ఇప్పుడు పవన్‌కల్యాణ్‌తో పాటు కేంద్రంలోని అధికారంలో ఉన్న బీజేపీతో పొత్తు పెట్టుకొని ఎన్నికలకు వెళ్తున్నది.

## ఏ రాష్ట్రాల్లో.. ఎప్పుడు

**తొలి దశ-ఏప్రిల్ 19 (102 స్థానాలు)**
తమిళనాడు(39), రాజస్థాన్(12), ఉత్తరప్రదేశ్(8), మధ్యప్రదేశ్(6), మహారాష్ట్ర(5), ఉత్తరాఖండ్(5), అస్సాం(5), బీహార్(4), పశ్చిమబెంగాల్(3), అరుణాచల్‌ప్రదేశ్(2), మణిపూర్(2), మేఘాలయ(2), ఛత్తీస్‌గఢ్(1), మిజోరం(1), నాగాలాండ్(1), సిక్కిం(1), త్రిపుర(1), అండమాన్ నికోబార్(1), జమ్ముకశ్మీర్(1), లక్షద్వీప్(1), పుదుచ్చేరి(1)

**రెండో దశ-ఏప్రిల్ 26 (89 స్థానాలు)**
కేరళ(20), కర్ణాటక(14), రాజస్థాన్(13), మహారాష్ట్ర(8), ఉత్తరప్రదేశ్(8), మధ్యప్రదేశ్(7), అస్సాం(5), బీహార్(5), ఛత్తీస్‌గఢ్(3), బెంగాల్(3), మణిపూర్(1), త్రిపుర(1), జమ్ముకశ్మీర్(1)

**మూడో దశ-మే 7 (94 స్థానాలు)**
గుజరాత్(26), కర్ణాటక(14), మహారాష్ట్ర(11), ఉత్తరప్రదేశ్(10), మధ్యప్రదేశ్(8), ఛత్తీస్‌గఢ్(7), బీహార్(5), పశ్చిమబెంగాల్(4), అస్సాం(4), గోవా(2), దాద్రానగర్ హవేలీ, డామన్ డయ్యూ(2), జమ్ముకశ్మీర్(1)

**నాలుగో దశ-మే 13 (96 స్థానాలు)**
ఏపీ(25), తెలంగాణ(17), యూపీ(13), మహారాష్ట్ర(11), ఎంపీ(8), బెంగాల్(8), బీహార్(5), జార్ఖండ్(4), ఒడిశా(4), జమ్ముకశ్మీర్(1)

**ఐదో దశ-మే 20 (49 స్థానాలు)**
ఉత్తరప్రదేశ్(14), మహారాష్ట్ర(13), పశ్చిమబెంగాల్(7), బీహార్(5), ఒడిశా(5), జార్ఖండ్(3), జమ్ముకశ్మీర్(1), లడఖ్(1)

**ఆరో దశ-మే 25 (57 స్థానాలు)**
ఉత్తరప్రదేశ్(14), హర్యానా(10), పశ్చిమబెంగాల్(8), బీహార్(8), ఢిల్లీ(7), ఒడిశా(6), జార్ఖండ్(4)

**ఏడో దశ-జూన్ 1 (57 స్థానాలు)**
ఉత్తరప్రదేశ్(13), పంజాబ్(13), పశ్చిమబెంగాల్(9), బీహార్(8), ఒడిశా(6), హిమాచల్‌ప్రదేశ్(4), జార్ఖండ్(3), చండీగఢ్(1).

**ఫలితాలు: జూన్ 4**

# కేజ్రీవాల్‌కు ముందస్తు బెయిల్

- 'మద్యం పాలసీ' కేసులో కవిత అరెస్టు నేపథ్యంలో ఢిల్లీ కోర్టుకు ఆప్ కన్వీనర్
- ఈడీ విచారణకు గైర్హాజరుపై వివరణ
- ఈడీ అభియోగాలు బెయిల్ పొందడానికి అవకాశం ఉన్న సెక్షన్లేనన్న న్యాయస్థానం
- బాండ్, పూచీకత్తుతో బెయిల్ మంజూరు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): 'మద్యం పాలసీ' కేసులో ఢిల్లీ సీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌కు ఊరట లభించింది. ఈ కేసు విషయమై ఆయనకు ముందస్తు బెయిల్ లభించింది. 'మద్యం పాలసీ' కేసులో బీఆర్‌ఎస్ నేత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు శుక్రవారం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శనివారం ఢిల్లీలోని రౌస్‌అవెన్యూ కోర్టుకు స్వయంగా కేజ్రీవాల్ హాజరయ్యారు. ఈ కేసు విషయమై ఈడీ విచారణకు గైర్హాజరవ్వడానికి గల కారణాలను న్యాయమూర్తి దివ్య మల్హోత్రకు తెలిపారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాల్సిందిగా అభ్యర్థించారు. కేజ్రీవాల్‌పై ఈడీ మోపిన అభియోగాలు బెయిల్ పొందడానికి అవకాశం ఉన్న సెక్షన్లేనని అభిప్రాయపడ్డ కోర్టు.. రూ.15,000 బాండ్, రూ.లక్ష పూచీకత్తుతో ముందస్తు బెయిల్ మంజూరు చేసింది.

**ఈడీ అభియోగాలు ఏమిటి?**
మద్యం పాలసీ కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలంటూ కేజ్రీవాల్‌కు ఇప్పటివరకూ ఈడీ పలుమార్లు సమన్లు జారీ చేసింది. అయితే వాటిని ఆయన తిరస్కరించారు. దీంతో కేజ్రీవాల్‌పై కోర్టులో ఈడీ ఫిర్యాదు చేసింది. అప్పుడు విచారణ జరిపిన ధర్మాసనం ఫిబ్రవరి 17న కోర్టుకు రావాలని ఆదేశించింది. అయితే ఆయన వర్చువల్‌గా కోర్టు విచారణకు హాజరయ్యారు. ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉండగానే కేజ్రీవాల్‌కు ఈడీ మళ్లీ సమన్లు జారీ చేసింది. చివరిసారిగా మార్చి 4న విచారణకు రావాలని పిలవగా.. సీఎం గైర్హాజరయ్యారు. దీంతో ఈడీ మరోసారి కోర్టును ఆశ్రయించింది. దీంతో మార్చి 16న తప్పనిసరిగా తమ ఎదుట హాజరుకావాలని కోర్టు కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కవిత అరెస్టుతో స్వయంగా హాజరవ్వాలని కేజ్రీవాల్ నిర్ణయించుకొన్నట్టు తెలిసింది. ఈడీ అభియోగాలపై విచారించిన కోర్టు.. అవి బెయిల్ పొందడానికి అవకాశం ఉన్న సెక్షన్లేనని పేర్కొంటూ కేజ్రీవాల్‌కు ముందస్తు బెయిల్‌ను మంజూరు చేసింది.

### 12 రాష్ట్రాల్లో మహిళా ఓటర్లు అధికం

న్యూఢిల్లీ: 12 రాష్ట్రాల్లో పురుష ఓటర్ల కన్నా మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని.. ఇది చాలా ఆరోగ్యకరమైన సంకేతమని ఈసీ శనివారం వెల్లడించింది. దేశంలో మహిళా ఓటర్ల సంఖ్య 47.1 కోట్లని తెలిపింది. పురుష-స్త్రీ ఓటర్ల నిష్పత్తి 1000:948గా ఉందని చెప్పింది. మహిళా ఓటర్లు అధికంగా ఉన్న రాష్ట్రాల పేర్లను మాత్రం బయట పెట్టలేదు.

### ప్రజాస్వామ్యంలో దాపరికానికి తావు లేదు

**ఎలక్టోరల్ బాండ్లపై సీఈసీ వ్యాఖ్య**

న్యూఢిల్లీ, మార్చి 16: ప్రజాస్వామ్యంలో దాపరికానికి తావు లేదని, ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలకు అన్ని విషయాలు తెలియజేయడమని కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వ్యాఖ్యానించారు. ఈ పారదర్శకత కోసమే తామంతా ఉన్నట్టు పేర్కొన్నారు. ఎలక్టోరల్ బాండ్ల విషయమై అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా స్పందించారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో తాము పారదర్శకత వైపే నిలిచినట్టు ఆయన తెలిపారు. అమెరికాలోలాగా విరాళాల మొత్తాలను రాజకీయ పార్టీలు బహిర్గతం చేసేలా చేయొచ్చా అని అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ... అందుకు సంస్థాగత యంత్రాంగం పరిష్కారం వెతకాలని, అయితే విరాళం ఇచ్చిన దాతలు వేధింపులకు గురి కాకుండా వారి గోప్యతను కూడా కాపాడాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి రాజకీయ పార్టీ ఎంత విరాళం పొందిందో, ఎన్నికల్లో ఎంత ఖర్చు చేసిందో వివరాలు వెల్లడిస్తూ వార్షిక అకౌంట్ అందించడాన్ని ఈసీ తప్పనిసరి చేసిందన్నారు.

# దర్యాప్తు సంస్థలతో దాదాగిరి

## ప్రతిపక్షాలే లక్ష్యంగా ఈడీ, సీబీఐ దాడులు

- పదేండ్లలో విపక్షాలపై 2,700% పెరిగిన కేసులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)
హైదరాబాద్, మార్చి 16 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐ వంటి రాజ్యాంగబద్ధ దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రత్యర్థులను, ప్రతిపక్ష పార్టీలను వేధించడానికి వినియోగిస్తున్నట్టు గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. 2004-14 మధ్య దేశవ్యాప్తంగా ఈడీ 112 చోట్ల సోదాలు నిర్వహించగా.. 2014-22 మధ్య 2,974 (2,655 శాతం పెరుగుదల) చోట్ల దాడులు జరిపింది. యూపీఏతో పోలిస్తే, బీజేపీ పాలనలో ప్రతిపక్ష నేతలపై నమోదైన కేసులు 2,700 శాతం పెరిగాయి. నమోదు చేసిన మొత్తం కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నాయకులపైనే ఫైల్ అయ్యాయి. దీంతో విపక్ష నేతలను దారికి తెచ్చుకోవడంలో భాగంగా కేంద్రం ఈ దాడులకు పాల్పడుతున్నదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**పదేండ్లలో విపక్ష పార్టీలపై ఈడీ, సీబీఐ కేసులు ఇలా..**

| పార్టీ | ఈడీ | సీబీఐ |
|---|---|---|
| కాంగ్రెస్ | 24 | 26 |
| టీఎంసీ | 19 | 30 |
| ఎన్సీపీ | 11 | 3 |
| శివసేన (ఠాక్రే) | 8 | - |
| డీఎంకే | 6 | 2 |
| బీజేడీ | 6 | 10 |
| ఆర్జేడీ | 5 | 10 |
| బీఎస్పీ | 5 | 5 |
| ఎస్పీ | 5 | 4 |
| టీడీపీ | 5 | 5 |
| ఆప్ | 4 | 4 |
| వైసీపీ | 3 | 6 |
| సీపీఎం | 2 | 4 |
| ఎన్సీ | 2 | 2 |
| పీడీపీ | 2 | 2 |
| బీఆర్‌ఎస్ | 2 | 1 |

## 44 రోజుల సుదీర్ఘ ఓటింగ్ వ్యవధి

**1951 తర్వాత ఇదే తొలిసారి**

న్యూఢిల్లీ, మార్చి 16: ఈసారి లోక్‌సభ ఎన్నికలు ఏడు దశల్లో జరగనున్నాయి. మొదటి విడత ఓటింగ్ ఏప్రిల్ 19 నుంచి ఓట్ల లెక్కింపు జరిగే జూన్ 4వ తేదీ వరకు మొత్తం 44 రోజుల పాటు ఓటింగ్ వ్యవధి ఉంటుంది. 1951 - 52 ఎన్నికల తర్వాత ఎక్కువ రోజులు ఓటింగ్ వ్యవధి ఉన్న ఎన్నికలు ఇవే. 1951 - 52లో దాదాపు నాలుగు నెలల పాటు ఓటింగ్ వ్యవధి కొనసాగింది. ఏకంగా 68 విడతల్లో అప్పుడు ఎన్నికలు జరిగాయి. ఇక, అతి తక్కువ ఓటింగ్ వ్యవధితో ఎన్నికలు పూర్తయ్యింది 1980 ఎన్నికల్లో. కేవలం నాలుగు రోజుల్లో అప్పుడు ఓటింగ్ ప్రక్రియ పూర్తయ్యి ఫలితాలు వచ్చేశాయి.


**ఏడు విడతల్లో పెట్టడానికి కారణమిదే**
ఈసారి ఏడు విడతల్లో ఎన్నికలు జరపడం వల్ల పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలకు నష్టం జరుగుతుందనే ఆరోపణను సీఈసీ రాజీవ్ కుమార్ కొట్టిపారేశారు. ఎవరికో అనుకూలంగా, ఇంకెవరికో ప్రతికూలంగా ఈ నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. మన దేశ భౌగోళిక పరిస్థితులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

## ఒకే స్థానం.. రెండు విడతల్లో..

**ఔటర్ మణిపూర్‌పై ఈసీ ప్రత్యేక నిర్ణయం**

న్యూఢిల్లీ, మార్చి 16: ఏడు విడతల్లో నిర్వహించే లోక్‌సభ స్థానాలను మొత్తం లెక్కిస్తే 544 సీట్లు వస్తున్నాయి. దేశంలో ఉన్నది 543 లోక్‌సభ స్థానాలే అయితే 544 స్థానాలకు షెడ్యూల్ ఎందుకు ప్రకటించారనే ప్రశ్న తలెత్తింది. దీనికి సీఈసీ రాజీవ్ కుమార్ వివరణ ఇచ్చారు. ఔటర్ మణిపూర్ స్థానానికి రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఇటీవల జరిగిన మణిపూర్ అల్లర్ల కారణంగా ఇండ్లు వదిలేసి వేరే ప్రాంతాల్లో తాత్కాలికంగా నివసిస్తున్నారు. వీరు ఓట్లు వేసేందుకు వీలుగా ఏప్రిల్ 19న, ఏప్రిల్ 26న రెండు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నట్టు రాజీవ్ కుమార్ తెలిపారు.

# సీఏఏపై సుప్రీంకోర్టుకు కేరళ సర్కార్



న్యూఢిల్లీ, మార్చి 16: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) అమలుపై స్టే విధించాలని కోరుతూ కేరళలోని పినరయి విజయన్ ప్రభుత్వం శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మరోవైపు ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ కూడా మరో పిటిషన్ వేశారు. ఇప్పటికే అస్సాంలో పూర్తై, దేశవ్యాప్తంగా చేపట్టాలని అనుకొంటున్న జాతీయ పౌరసత్వ రిజిస్టర్‌తో(ఎన్ఆర్సీ) పౌరసత్వ సవరణ చట్టానికి సంబంధం ఉన్నదని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. సరిగ్గా లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఏఏ-2019ను దేశవ్యాప్తంగా అమలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఈనెల 11న నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై ఈనెల 19న ఒకేసారి విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇప్పటికే అంగీకరించారు.

## బీజేపీలో కమీషన్ల వ్యవస్థ

**కాంట్రాక్టర్లు 2% లంచం ఇవ్వాలి**
**గుజరాత్ బీజేపీ ఎమ్మెల్యే బహిరంగ వ్యాఖ్య**

అహ్మదాబాద్, మార్చి 16: బీజేపీపై సొంత పార్టీ ఎమ్మెల్యే ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. పార్టీలో కమీషన్ల వ్యవస్థ ఉన్నదని బాంబు పేల్చారు. కాంట్రాక్టర్లు చేసే ప్రభుత్వ పనుల విలువలో 2 శాతం కమీషన్లు ఇవ్వాలని బాహాటంగానే పేర్కొన్నారు. గుజరాత్‌లోని జలాల్‌పూర్ బీజేపీ ఎమ్మెల్యే రమేశ్‌భాయ్ చొటుభాయ్ పటేల్ ఇటీవల అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టరుకు ఆయన సలహా రూపంలో ఒక హెచ్చరిక చేశారు. 'చెరువు సుందరీకరణకు నాలుగు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని, ఈ డబ్బుల్లో బీజేపీ వ్యవస్థలో ఉన్న 2 శాతానికి మినహా ఎవరికీ అదనంగా ఇవ్వొద్దని' బహిరంగంగా ప్రకటించారు. ఆయన వ్యాఖ్యలపై గుజరాత్‌లో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. గతంలో బీజేపీ నేతలు రహస్యంగా అవినీతికి పాల్పడేవారని, ఇప్పుడు మాత్రం బహిరంగంగానే ఒప్పుకుంటున్నారని కాంగ్రెస్ నేత హిరెన్ బంకర్ విమర్శించారు.

## మహారాష్ట్రలో టీచర్లకు డ్రెస్‌కోడ్

ముంబై : ఉపాధ్యాయులకు డ్రెస్‌కోడ్‌ను విధిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఉపాధ్యాయులు ధరించే ఆధునిక దుస్తులు విద్యార్థులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని, ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు జీన్స్, టీ షర్టు, డిజైనర్, ప్రింటెడ్ దుస్తులు ధరించి స్కూలుకు రాకూడదని షరతులు విధించింది. మహిళా ఉపాధ్యాయులు జీన్స్, టీ-షర్టులు, ముదురు రంగులు, డిజైన్లు లేదా ప్రింట్లు ఉన్న దుస్తులను ధరించకూడదు. వారు కుర్తా దుపట్టా, సల్వార్, చుడీదార్, లేదా చీర ధరించాలని మహా సర్కార్ తెలిపింది. ఈ నిబంధనలు ప్రైవేట్ ఉపాధ్యాయులకు కూడా వర్తిస్తాయి.



## గేట్ ఫలితాలు వెల్లడి


బెంగళూరు, మార్చి 16: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్) 2024 ఫలితాలు వెల్లడయ్యాయి. శనివారం బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్.. గేట్ ఫలితాలను విడుదల చేసింది. ఫలితాలను goaps.iisc.ac.in వెబ్‌సైట్‌లో చూడవచ్చని ప్రకటించింది. అభ్యర్థులు స్కోర్‌కార్డులను మార్చి 23 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఫిబ్రవరి 3, 4, 10, 11 తేదీల్లో గేట్ పరీక్ష జరిగిన సంగతి తెలిసిందే.




## 123 అడుగుల దోశ

వినటానికే వింతగా ఉంది కదూ.. వంద మంది కలిస్తే కానీ ఈ ఒక్క దోశను తినలేరు. బెంగళూరులోని ప్రముఖ కంపెనీ ఎంటీఆర్ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ అరుదైన ఫీట్‌ను సాధించింది. లోర్మాన్ కిచన్ ఎక్విప్‌మెంట్స్ సహకారంతో ఏకంగా 123 అడుగుల దోశను తయారు చేసింది. 2014లో 54 అడుగుల దోశ పేరిట ఉన్న రికార్డు పదేండ్ల తర్వాత బ్రేక్ అయ్యింది.

## తోకతో జన్మించిన శిశువు



బీజింగ్, మార్చి 16: చైనాలో అరుదైన ఘటన జరిగింది. ఓ మగ శిశువు తోకతో జన్మించాడు. హాంగ్‌ఝౌ చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో జన్మించిన ఈ శిశువును చూసి డాక్టర్లు సైతం ఆశ్చర్యపోయారు. దాదాపు 10 సెంటీమీటర్ల(3.9 ఇంచులు) పొడవుతో మృదువుగా, ఎలాంటి ఎముక లేకుండా ఈ తోక ఉంది. దీనిని టెథర్డ్ స్పైనల్ కార్డ్ అంటారని వైద్యులు తెలిపారు. వెన్నెముక చివరి భాగం.. చుట్టుపక్కల ఉండే కణజాలంతో అనుసంధానం అయినందున టెథర్డ్ స్పైనల్ కార్డ్ ఏర్పడిందని చెప్పారు. తోకతో జన్మించిన శిశువును చూసి ఆందోళన చెందిన తల్లి.. సర్జరీ చేసి తొలగించాల్సిందిగా డాక్టర్లను కోరారు. అయితే, ఇది బాలుడి నాడీ వ్యవస్థతో ముడిపడి ఉన్నందున తొలగిస్తే సమస్యలు రావొచ్చని వైద్యులు భావిస్తున్నారు. గత జూన్‌లో దక్షిణ అమెరికాలోని గయానాలో కూడా ఒక శిశువు ఇలాగే జన్మించగా సర్జరీ చేసి తొలగించారు.